
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 36.3, కనిష్ఠం 26.7



ఆదిలాబాద్

జిల్లా వార్తలు

5

గురువారం 19 జూన్ 2025

స్కూల్ బస్సుల తనిఖీ

ఉట్నూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రైవేట్ పాఠశాలల బస్సులను మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ హరిప్రసాద్ బుధవారం తనిఖీ చేశారు. పాఠశాలల విద్యార్థులను తరలించే బస్సుల కండిషన్‌ను పరిశీలించారు. బస్సుల రిజిస్ట్రేషన్ కాగితాలు, డ్రైవర్‌లైసెన్స్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలల బస్సులను జాగ్రత్తగా నడపాలని డ్రైవర్లకు సూచించారు. ఆయన వెంట ఆర్టీఏ మెంబర్ దూటరాజేశ్వర్, సిబ్బంది ఉన్నారు.



పోస్టర్‌ను ఆటోకు అతికిస్తున్న జిల్లా ఎస్పీ

ప్రయాణికుల భద్రతే ధ్యేయం

● జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌అర్బన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల భద్రత, రక్షణే ధ్యేయంగా జిల్లాలో మొట్టమొదటిసారిగా " అభయ షై టాక్సీ ఇస్ సేఫ్"ను ప్రారంభించామని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బుధవారం స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్‌తో కలిసి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ యువతులు, మహిళలు, ప్రయాణికుల భద్రత చర్యలలో భాగంగా జిల్లాలోని ఆటోలకు క్యూఆర్ కోడ్ స్కానర్లను పెట్టామన్నారు. ప్రయాణికులు ఎక్కిన వెంటనే క్యూఆర్ కోడ్ కనిపిస్తుందని, దీనిని స్కాన్‌చేసిన తర్వాత ప్రయాణికులకు ఒక వెబ్ అప్లికేషన్‌లోకి వెళ్తుందన్నారు. అందులో మొబైల్ నెంబర్ ఎంటర్ చేసినట్లయితే వారికి ట్రాక్ షై లోకేషన్, ఎమర్జెన్సీ కాల్, కంప్లైంట్ మూడు భద్రత ఆప్షన్లు కనిపిస్తాయన్నారు. ఎలాంటి ఫిర్యాదులు లేకుండా సక్రమంగా గమ్యస్థానాలకు చేరుతున్న ప్రయాణికులు ఆటోలకు రేటింగ్ ఇవ్వవచ్చని తెలిపారు. అనంతరం జిల్లా ఎస్పీ, ఉన్నతాధికారులు షై ఆటో ఇస్‌సేఫ్ అనే కార్యక్రమ పోస్టర్‌ను విడుదల చేశారు. ఆటోలలో సంఘ వ్యతిరేక కార్యక్రమాలు జరిగితే వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలని తెలిపారు. జిల్లా ఎస్పీ స్వయంగా అభయ షై టాక్సీ ఇస్ సేఫ్ పోస్టర్‌ను ఆటోకు అతికించారు. ఇందులో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్, ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రణయ్ కుమార్, పట్టణ ఇన్‌స్పెక్టర్‌లు బి.సునిల్‌కుమార్, సీహెచ్ కరుణాకర్‌రావు, ఎస్సైలు ముజాహిద్, అశోక్, మహేందర్, దేవేందర్ తదితరులున్నారు.

ఐటీఐ, ఏటీసీలలో చేరాలని ఉద్యోగుల ప్రచారం



అవగాహన కల్పిస్తున్న ఐటీఐ ప్రిన్సిపాల్

ఉట్నూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఉన్న గిరిజన పారిశ్రామిక శిక్షణ కేంద్రంతో పాటు ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన నూతన సాంకేతిక విద్య కోర్సులలో చేరాలని ఉట్నూర్ ఐటీఐ సిబ్బంది ఏజెన్సీలోని వివిధ పాఠశాలల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఉట్నూర్ ఐటీఐ ప్రిన్సిపాల్ రేడ్డ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు ఏజెన్సీ ప్రాంతంలోని దంతనపల్లి, లక్కారం, ఇంద్రవెల్లి, తోషం గుడిహత్నూర్ ప్రాంతాలలో ఉన్న పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. ఆధునిక కోర్సులతో పాటు పారిశ్రామిక శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ అవకాశాలు ఉన్నాయని శ్రీనివాస్ వివరించారు.



భీంపూర్ పోలీసుస్టేషన్ ఆవరణలో యూరియా బస్తాల లారీ

వక్రమార్గం

అడ్డదారిలో మహారాష్ట్రకు తరలిపోతున్న యూరియా

- జిల్లా నుంచి మహారాష్ట్రకు తరలిపోతున్న యూరియా
- తాజాగా భీంపూర్‌లో 10 మెట్రిక్ టన్నుల యూరియా పట్టివేత
- రైతుల పేరిట ఫర్టిలైజర్ వ్యాపారుల అడ్డగోలు దందా
- యూరియా అక్రమ దందాకు ఓ వ్యవసాయ అధికారి అండదండలు
- అన్నీ తెలిసి చోద్యం చూస్తున్న వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు

ఆదిలాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్రలో యూరియాకు భారీ డిమాండ్ ఏర్పడడంతో జిల్లా వ్యాపారులు అడ్డదారిలో సరిహద్దులు దాటిస్తూ అమ్మేసుకుంటున్నారు. 'దొరికితే దొంగ లేదంటే దొర' అనే చందంగా యూరియా అక్రమ రవాణా సాగుతోంది. ఈ యేడు జిల్లాకు సరిపడా యూరియా నిల్వలను ప్రభుత్వం సరఫరా చేసినా.. కొంత మంది వ్యాపారులు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ అడ్డగోలు సంపాదనకు ఎగబడుతున్నారు. బుధవారం భీంపూర్ మండలం అందర్‌బంద్ గ్రామానికి నిబంధనలకు విరుద్ధంగా 10 మెట్రిక్ టన్నుల యూరియా బస్తాలను తరలించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మహారాష్ట్ర వైపుకు వెళ్తున్న యూరియా లారీని అడ్డుకుని భీంపూర్ పోలీసు స్టేషన్‌కు తరలించి దర్యాప్తు జరుపుతున్నారు. ఈ యేడు వానాకాల సీజన్‌లో పంటల సాగు అవసరాలకు 39వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందులో జూన్‌కు సంబంధించిన 8వేల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలను అందుబాటులో ఉంచారు. ప్రస్తుతం జిల్లాలో పత్తి, సోయా, కంది విత్తనాలను జోరుగా విత్తుతున్నారు. నీటి సౌకర్యం ఉన్న రైతులు మే చివరిలోనే పత్తి విత్తనాలను విత్తారు. దీంతో ఇప్పుడిప్పుడే పంటలు మొలక దశలో కనిపిస్తున్నాయి. అయితే మొలకెత్తిన పంటలకు జూలై మొదటి వారం నుంచి యూరియాను వేసుకోవాల్సి ఉంటుంది. కానీ జూన్‌లోనే భారీగా యూరియా సేల్స్ పెరిగి పోవడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఆదిలాబాద్ టు మహారాష్ట్ర

జిల్లా కేంద్రం నుంచి మహారాష్ట్రకు యూరియా బస్తాలను తరలిస్తూ అమ్మేసుకోవడం కొందరు వ్యాపారులకు అలవాటుగానే మారిందంటున్నారు. అలాగే జిల్లాలో నిషేధం ఉన్న విత్తనాలు, రసాయన ఎరువులు, మందులను ఇక్కడ విక్రయిస్తూ అక్రమ సంపాదనకు తెరలేపుతున్నారు. ఇటీవల జిల్లాలో పట్టుబడిన నకిలీ పత్తి విత్తనాలు, రౌండప్ గడ్డి మందులను మహారాష్ట్ర నుంచి తరలిస్తుండగా అధికారులు పట్టుకున్నారు. ప్రస్తుతం మహారాష్ట్రలో భారీగా యూరియా కొరత ఉండడంతో జిల్లా వ్యాపారులు అడ్డదారిలో పొరుగు రాష్ట్రానికి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. 220 యూరియా బస్తాలను భీంపూర్ మండలానికి తరలించి అక్కడి నుంచి మ్యాక్స్ వ్యానుల్లో మహారాష్ట్రకు తరలిస్తుండగా అధికారులు పట్టుకున్నారు. కొద్ది రోజులుగా వ్యాపారులు ఇదే తరహాలో మహారాష్ట్రకు భారీగా యూరియాను తరలించి అమ్మేసుకున్నట్లు సమాచారం. జిల్లా కేంద్రంలోని ఇద్దరు ముగ్గురు బడా ఫర్టిలైజర్ వ్యాపారులు అడ్డగోలుదందాలకు తెరలేపుతున్నా.. వారిని అడిగే వారే కరువవుతున్నారు. ఈ వ్యాపారులకు రాజకీయ అండదండలు పుష్కలంగా ఉండడంతో వ్యవసాయ శాఖ అధికారులు అడిగేందుకు జంకుతున్నట్లు సమాచారం.

నిబంధనలకు ఎగనామం

ఎరువుల అమ్మకాలలో అక్రమాలు చోటు చేసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఫర్టిలైజర్ షాపుల్లో బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తోంది. కానీ జిల్లాలో ఈ విధానం ఎక్కడా అమలు కావడం లేదని తెలుస్తోంది. అధికారుల అండదండలతో హోల్‌సెల్ నుంచి నేరుగా ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ అమ్మేసుకుంటున్నారు. అసలు నిబంధనల ప్రకారం హోల్‌సెల్ నుంచి రిటైల్ ఆ తర్వాత రైతులకు విక్రయించాల్సి ఉంటుంది. కానీ వ్యాపారులు నిబంధనలు పాటించకుండా అడ్డగోలుగా వ్యవహరిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. మొదట హోల్‌సెల్ నుంచి రైతులకు నేరుగా సప్లయి చేస్తున్న వ్యాపారులు ఆ తర్వాత రైతుల ఆధార్

మిగతా 6వ పేజీలో...



పరిశీలించి చర్యలు తీసుకుంటాం..

: శ్రీధర్‌స్వామి (జిల్లా వ్యవసాయ శాఖాధికారి)



నిబంధనలకు విరుద్ధంగా ఎరువులను విక్రయించిన వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం. భీంపూర్ మండలంలో పట్టుబడ్డ యూరియా బస్తాల లారీ రైతుల పేరిట ఉన్న బిల్లులతోనే సరఫరా చేయడం జరిగింది. కానీ నేరుగా రైతులకు హోల్‌సెల్ నుంచి సరఫరా చేసే అవకాశం లేదు. రిటైల్‌గా మార్చిన తర్వాతనే రైతులకు విక్రయించాల్సి ఉంటుంది. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. సంబంధిత అధికారి పాత్ర ఏమైనా ఉంటే శాఖపరమైన చర్యలు తప్పవు.

విద్యార్థులు పరిశుభ్రత పాటించాలి

● జిల్లా కలెక్టర్ రాజార్షిషా

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరిశుభ్రతను పాటిస్తే ఎలాంటి రోగాలు, ఇన్‌ఫెక్షన్లు రావని జిల్లా కలెక్టర్ రాజార్షిషా అన్నారు. బుధవారం పాత మున్సిపల్ కార్యాలయంలో పరిధిలోని కాంప్లెక్స్‌లో ఇకోఫ్యూర్ శానిటరీ నాప్కిన్ ప్యాడ్స్ తయారీ యూనిట్‌ను జిల్లా కలెక్టర్ రాజార్షిషా ప్రారంభించి విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మెప్మా ఆధ్వర్యంలో అన్ని శాఖల సహకారంతో ఇకోఫ్యూర్ శానిటరీ తయారీ యూనిట్‌ను ప్రారంభించుకున్నామన్నారు. వైద్యులు ఈ కార్యక్రమంపై విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారని, ముఖ్యంగా ఆడపిల్లలకు ఏ వయసులో అవసరమో వాటి గురించి అవగాహన కల్పించాలని సూచించారు. శానిటరి ప్యాడ్లను వినియోగించాలని, వాటి వినియోగం గురించి ప్రతివిద్యార్థికి తెలిసి ఉండాలన్నారు. ఇది వరకే ఆరోగ్య పాఠశాల కార్యక్రమం ద్వారా పరిశుభ్రత, హైజీన్‌ను పాటిస్తే ఇన్‌ఫెక్షన్‌ను నివారించవచ్చని అవగాహన చేపట్టామన్నారు. అమ్మాయిలకు పీరియడ్స్ వచ్చే సమయంలో వారికి తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని ఈ విషయంపై ఇది వరకే ఆరోగ్య పాఠశాలలో కూడా మాట్లాడడం జరిగిందన్నారు. రక్తహీనత భారీన పడకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన యూనిట్ ద్వారా శానిటరీ పాడ్స్ తయారు చేసి పాఠశాలలకు పంపించడం జరుగుతుందని తెలిపారు. దీంతో పాటు ఐరన్ పాలిక్ ఆసిడ్‌టాబ్లెట్స్ కూడా తప్పకుండా అమ్మాయిలు వేసుకోవాలని, హిమోగ్లోబిన్ అమ్మాయిలలో 11 నుంచి 12 వరకు తప్పనిసరిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డా.నరేందర్‌రాథోడ్, డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి,ఎల్‌డీఎం, టీజీబీ ఆర్ఓ నాయక్, డిస్ట్రిక్ ఇండస్ట్రియల్ మేనేజర్ పద్మభూషన్‌రాజు, మున్సిపల్ కమిషనర్ సీవీఎన్‌రాజు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సాధన, టీబీ నివారణ అధికారి సుమలత, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పథకాలను వినియోగించుకోవాలి...

పీఎం జన్మన్ పథకాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. గిరిజన గ్రామాల్లో ఇండ్లు, తాగునీరు, విద్య, వైద్యం,రహదారులు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు వంటి ప్రాథమిక వసతుల పై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. జూన్ 15 నుంచి 30 వరకు జిల్లాలోని గ్రామాల్లో ప్రత్యేక క్యాంపులను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో ముఖ్యంగా జన్‌ధన్ బ్యాంక్ అకౌంట్, ఇందిరమ్మ ఇండ్లు, మెడికల్ చెకప్, సికిల‌సెల్, రైతు సదస్సులు పీఎంజన్మన్‌లో దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఆధార్‌నమోదు, అప్‌డేట్ లాంటి సమస్యల పరిష్కారం చూపుతామన్నారు. అన్నిశాఖల సహకారంతో గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మండలాల వారీగా ప్రత్యేక క్యాంపులను నిర్వహిస్తామని తెలిపారు.

చిన్న పరిశ్రమలు ఏర్పాటు అభినందనీయం

స్వయం సహాయక సంఘాలు గ్రూప్‌గా ఏర్పడి చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేయడం అభినందనీయమని కలెక్టర్ రాజార్షిషా అన్నారు.బుధవారం ఇందిరానగర్‌లో ఈగ విజయలక్ష్మి వీరంజనేయ స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో విజయ హెల్తీ ఫుడ్స్ యూనిట్‌ను జిల్లా కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ సీవీఎన్‌రాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సంద ర్భంగా నో మైదా...నో షుగర్‌తో తయా రుచేస్తున్న బిస్కెట్లు, లడ్డుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం బిస్కెట్‌ల తయారీ పరికరాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఇందులో మెప్మా డీఎంసీ శ్రీనివాస్, శానిటరి ఇన్స్‌పెక్టర్ శంకర్, టీఎంసీ భాగ్యలక్ష్మి, సీఓలు, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.



శానిటరీ తయారీ యూనిట్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

గంజాయి సాగు చేస్తే పథకాలు రద్దు..

భీంపూర్ : గ్రామాలలో గంజాయి పండించిన, అమ్మినా, కొన్న సేవించిన ప్రభుత్వపథకాలు రద్దు అవుతాయని కలెక్టర్ రాజర్షి షా హెచ్చరించారు. రైతులు చేలలో, ఇంటి పెరట్లో గంజాయి సాగు చేస్తే ప్రభుత్వ పథకాలు రైతుభరోసా, రుణ మాఫీ ఆగి పోతాయని కలెక్టర్ వివరించారు. భీంపూర్ మండలం గుంజలలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సద స్సు, పీఎం జన్మన్, ఆరోగ్య శిబిరాలను పరిశీలించారు. కాగా గుంజలలో దశాబ్దాలుగా తాము సాగు చేసు కుంటున్న భూములకు పట్టాలు మంజూరు చేయా లని ఈ సందర్భంగా గ్రామ పెద్దలు సోయం కాంత రావు, రామేశ్వరలు కలెక్టర్‌కు విన్నవించారు. అలాగే మంచినీటి సమస్య, రైతులకు చేలల్లకు వెళ్లేందుకు రోడ్డు నిర్మించాలని విన్నవించారు. కలెక్టర్ వైద్య శిబిరంలో ఆరోగ్య పరీక్షల గురించి తెలుసుకున్నారు గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా, శుద్ధ జలం తీసు కునేలా వైద్య సిబ్బంది గ్రామాలలో మరింత అవగా హన కల్పించాలన్నారు. భూభారతిలో రైతులు తమ సమస్యను పరిష్కరించుకోవాలని గుర్తు చేశారు. పీఎం జన్మన్ అభ కార్యక్రమంతో గిరిజన గ్రామాలలో వంద శాతం ప్రభుత్వ పథకాల లబ్ధి పొందేలా అవసరమైన సర్టిఫికెట్‌లను కూడా ఈ ప్రత్యేక కార్యక్రమంలో పొందవచ్చు అని వివరించారు.



గుంజలలో ఆరోగ్య శిబిరం పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్



రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ రామకృష్ణ

అధిక ధరలకు విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చర్యలు

● వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామకృష్ణ

తలమడుగు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రైతు సోదరులకు ఎవరైనా అధికధరలకు విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామకృష్ణ అన్నారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని విత్తనాల దుకాణాలు, సహకార సంఘాల ద్వారా అందిస్తున్న రసాయన ఎరువులు షాపులను పరిశీలించారు. ఈ సందర్భంగా షాపులలో రిజిష్టర్లు తదితర విషయాలను వ్యవసాయ శాఖ ఏడీ రామకృష్ణ, మండల వ్యవసాయ అధికారి ప్రమోద్‌రెడ్డితో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం జిల్లా వ్యవసాయ శాఖ ఏడీ రామకృష్ణ మాట్లాడుతూ ఖరీఫ్‌సాగుకు అవసరమయ్యే రసాయన ఎరువులు తలమడుగు సహకార సంఘం ద్వారా ఆయా గ్రామాలలో అందుబాటులో ఉంచామని, మోతాదుకు మించి రైతులు రసాయన ఎరువులు వాడకూడదన్నారు. అన్ని రకాల విత్తనాల స్టాకులు ఉన్నాయని, రైతులు ఒకే రకమైన విత్తనం కాకుండా మూడు నాలుగు రకాల విత్తనాలను విత్తుకుంటే దిగుబడుల విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం ఉండదన్నారు. విత్తనషాపులో తప్పకుండా బిల్లు, రసీదులు తీసుకోవాలని వాటిని జాగ్రత్తగా ఉంచుకోవాలని, ఎవరైనా అధిక దరలకు విత్తనాలను అమ్మితే వ్యవసాయ అధికారులకు తెలియజేయాలన సూచించారు. అంతేకాకుండా విత్తనాలు విత్తుకునే సమయం జూలై, ఆగస్టు మాసం వరకు ఉందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో తలమడుగు సహకార సంఘం సీఈవో మోతే శ్రీనివాస్, ఏఈవోలు రమేష్, సతీష్, సిబ్బంది రమాకాంత్, సత్యనారాయణ, భరత్, తదితరులు ఉన్నారు.

క్రీడా పాఠశాలలో చేరిక కోసం విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను ఎంపిక చేస్తున్న అధికారులు

తలమడుగు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని తెలంగాణ క్రీడాపాఠశాలలో అర్హులైన విద్యార్థులను చేర్పించేందుకు బుధవారం తలమడుగు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి వెంకట్‌రావు మాట్లాడుతూ విద్యార్థులను చదువుతో పాటు క్రీడల్లో రాణించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో మూడుక్రీడా పాఠ శాలలను ఎంపిక చేసిందన్నారు. ఇందులో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో క్రీడాపాఠశాల ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. ప్రతి సంవత్సరం క్రీడాకారులను ఎంపిక చేసినందుకు నిర్వహిస్తున్న ఎంపికలో భాగంగా తలమడుగులో నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం వివిధ పాఠశాలల నుంచి వచ్చిన క్రీడాకారులను ఎంపిక చేశారు. వీటిలో నామ్‌దేవ్, రమేష్, శంకర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్టీ అధికారంలోకి రావడంలో యూత్ కాంగ్రెస్‌యే కీలకం

● రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి



నివాళి అర్పిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు, నాయకులు

ఆదిలాబాద్ అర్బన్, జూన్18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి యూత్‌కాంగ్రెస్ కీలకంగా వ్యవహరించిందని రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో నిర్వహించిన యూత్ కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మొదటిసారి ఆదిలాబాద్‌కు వచ్చిన ఆయనను యూత్‌కాంగ్రెస్ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా కొమురంభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపేలక్ష్యంగా యూత్‌కాంగ్రెస్ శ్రేణులు పనిచేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ తరపున పోటీచేస్తామన్నారు. ఇందులో తెలంగాణ రాష్ట్రఇన్‌చార్జీ ఖలీద్ అహ్మద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజిద్‌ఖాన్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎర్రమళ్ల రామచంద్రారెడ్డి, యువజన కాంగ్రెస్ ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జీ అల్మాస్‌ఖాన్, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు సాయి చరణ్‌గౌడ్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతన్‌రావు, ఆదిలాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు హార్పత్ ఖాన్, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షులు నాహిద్, బోథ్ అసెంబ్లి ప్రెసిడెంట్ బద్దంపోతారెడ్డి, యువ జన కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామరూపేష్‌రెడ్డి,బోథ్ అసెంబ్లి ఉపాధ్యక్షుడు అనిష్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు ధ్రువపత్రాల అందజేత



మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

ఉట్నూర్, జూన్18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఇళ్లులేని పేద ప్రజలకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ధృవపత్రాలను 32 మందికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 32 మంది లబ్ధిదారులకు బుధవారం ధృవపత్రాలను పంపిణీ చేసి మాట్లాడారు. ఉట్నూర్ పట్టణంలోని శాంతినగర్, ఫకీర్‌గుట్టలకు చెందిన వారికి ఇళ్లు మంజూరు అయినందున పత్రాలు అందించామన్నారు. పేద ప్రజలను గుర్తించి ఇళ్లు మంజూరు చేశామని, రానివారు ఎలాంటి అసంతృప్తికి గురికావద్దని మరిన్ని నాలుగుదఫాలుగా ఇళ్లు మంజూరు అవుతాయన్నారు. ఇళ్లు మంజూరైన వారు నాసిరకంగా ఇళ్లు నిర్మించుకోవద్దని, పదికాలాల పాటు ఉండేలా నిర్మించుకోవాలన్నారు. ఈ సందర్భంగా అంతకు ముందు శాంతినగర్, ఫకీర్‌గుట్ట కాలనీల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణపనులకు ఎమ్మెల్యే బొజ్జుపటేల్ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాంప్రసాద్, కార్యదర్శి శంకర్, డీసీసీబీ జిల్లా డైరెక్టర్ ఎస్సీరెడ్డి, ఆర్టీవో జిల్లా సభ్యులు దూటరాజేశ్వర్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు లింగంపల్లి చంద్రయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఖయ్యుం, నాయ కులు ఇక్బాల్, రాజేశ్‌నాయక్, కొత్తపల్లి మహేందర్, లోకనాథం, అబ్దుల్‌కైసర్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన

సిరికొండ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం అందిస్తున్న పలు ప్రభుత్వ సామాజిక, సంక్షేమ పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రవీందర్ సూచించారు. జెండాగూడ గ్రామంలో బుధవారం దర్తిఆభజన్ భాగీదరి అభియాన్ పథకంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్, హెల్త్ అసిస్టెంట్ రాథోడ్ కృష్ణ పాల్గొన్నారు.

మాగంటికి నివాళి

నేరడిగొండ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జూబ్లిహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పెద్దకర్మ కార్యక్రమానికి హైదరాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి బోథ్‌ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గోపీనాథ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీమంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

మంత్రి వివేక్ వెంకటస్వామిని కలిసిన ఆడే గజేందర్

నేరడిగొండ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నూతనంగా బాధ్యతలు తీసుకున్న రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామిని బుధవారం బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఏజెన్సీ అభివృద్ధి కోసమే ఇచ్చోడకు కళాశాల మంజూరు

ఇచ్చోడ, జూన్ 18, (ఆంధ్రజ్యోతి) : ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ఈ ప్రాంత నాయకులు ప్రజల కోరిక మేరకు ప్రభుత్వం ఇచ్చోడలో డిగ్రీ కళాశాల మంజూరు చేసిందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ అన్నారు. బయటివ్యక్తులు కావాలనే ప్రభుత్వ కళాశాలపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి భూభారతి

జైనథ్, జూన్18 (ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారానికే భూభారతి చట్టం తీసుకువచ్చిందని సాత్నాల మండల తహసీల్దార్ మడావి విశ్వనాథ్ అన్నారు. జైనథ్ ఉమ్మడి మండలంలోని పార్డి(కే) గ్రామంలో బుధవారం నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో జైనథ్ వ్యవసాయాధికారి ఆనంద్ పాల్గొన్నారు.

నేడు కంటి వైద్యశిబిరం

ఉట్నూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో డివిజన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచితకంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని సంఘం అధ్యక్షులు షరీఫ్, ప్రధాన కార్యదర్శి కట్టలక్ష్మణచారిలు తెలిపారు. అవకాశాన్ని విశ్రాంత ఉద్యోగులు వినియోగించుకోవాలన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం : ఎస్పీ

ఇచ్చోడ, బజార్‌హత్నూర్ జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ఇచ్చోడ పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ ఎం.నాగేశ్వరరావ్ అనారోగ్య సమస్యలతో బుధవారం ఉదయం నాలుగు గంటల ప్రాంతంలో విధుల్లో ఉండగానే మృతిచెందినట్లు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. బజార్‌హత్నూర్ మండలంలోని జాతర్ల గ్రామంలో నిర్వహించిన అంత్యక్రియల్లో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్ హాజరై నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి జిల్లా పోలీసు యంత్రాంగం ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి తక్షణ సహాయార్థం రూ.30వేల ఆర్థికసాయాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు.

● పంచాయతీ ఎన్నికల్లో అప్రమత్తంగా ఉండాలి

రానున్న పంచాయతీ ఎన్నికల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ పోలీసుసిబ్బందికి సూచించారు. బుధవారం బజార్‌హత్నూర్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఆయన సిబ్బందికి పలుసూచనలు చేశారు. మండలంలోని గ్రామాలను సందర్శిస్తూ ప్రజలతో మంచి సత్సంబంధాలను మెరుగుపర్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో బోథ్ సీఐ వెంకటేశ్వ రరావు, ఇచ్చోడ సీఐ బండారి రాజు, ఎస్సై సంజయ్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.



అంత్యక్రియలకు హాజరైన ఎస్పీ, ఏఎస్పీ

మంత్రులను కలిసిన కంది



జిల్లా ఇన్‌చార్జీ మంత్రి జూపల్లికృష్ణారావును సన్మానిస్తున్న కంది

ఆదిలాబాద్‌అర్బన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జీ మంత్రిగా నియమితులైన రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి బుధవారం రాష్ట్ర సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అదేవిధంగా ఇటీవల జరిగిన మంత్రివర్గవిస్తరణలో చోటు దక్కించుకుని మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన మంచిర్యాల జిల్లా చెన్నూర్‌కు చెందిన వివేక్ వెంకటస్వామిలను సచివాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

సప్లిమెంటరీ ఫలితాలలో విద్యార్థుల ప్రతిభ

ఉట్నూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షల ఫలితాలలో ఉట్నూర్ చైతన్య విద్యార్థులు జిల్లా టాపర్‌గా నిలిచారు. ఎంపీసీ ప్రథమ సంవత్సరం ఫలితాలలో భుక్యా అనిల్‌కుమార్ 459 మార్కులు సాధించారు. పొలిపల్లి సాయిస్మరన్‌కు 458, అంజు కన్వర్‌కు 457, బానోత్ అఖిత్‌కు 453, దేవులపల్లి సాన్వికి 450, భుక్యావికాస్‌కు 450 మార్కులు వచ్చాయి. బైపాసీ ప్రథమ సంవత్సరంలో బానోత్ నిక్షిత్‌నాయక్‌కు 434 గేడం హరిహరన్‌కు 433, విశ్వస్‌రావుకు 432, సీహెచ్ ప్రణిక్ష 424, ఆడే సాయి సిద్ధార్థ 420, నికం అనుష్క 419 మహిన్‌బేగం 418, అయన్ అహ్మద్, సుకృతి, గిత్తే స్నేహాలకు 410 చొప్పున మార్కులు సాధించారని ప్రిన్సిపల్ ప్రకాష్ తెలిపారు. విద్యార్థులను దాసండ్ల ప్రభాకర్, పంద్రజైవం త్‌రావు, పోదిల అనిత సుదర్శన్, రాజేశ్వర్, గోపాల్‌నాయక్, రాజ్‌కుమార్‌లు అభినందించారు.

మాహోర్‌కు బస్సుసౌకర్యం

బోథ్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పవిత్ర క్షేత్రాలైన రేణుకామాత, దత్తాత్రేయ, అనసూయ మాత దేవాలయాలు ఉన్న మాహోర్‌కు నిర్మల్ డిపో నుంచి బస్సు నడుపుతున్నట్లు డిపోమేనేజర్ కె.పాండు తెలిపారు. నిర్మల్ నుంచి ఉదయం ఆరుగంటల 20 నిమిషాలకు బయలుదేరి 10.20 నిమిషాలకు చేరుకుంటుందన్నారు. మాహోరు నుంచి 11 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 3గంటలకు నిర్మల్ చేరుకుంటుందన్నారు. 50 నిమిషాలకు నిర్మల్ నుంచి బయలుదేరి మాహర్ 4.50 నిమిషాలకు చేరుకుని మాహరార్ నుంచి సాయంత్రం 5 గంటలకు బయలు దేరుతుందన్నారు. రాత్రి 9 గంటలకు చేరుకుంటుందని వివరించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలి

సిరికొండ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని సిరికొండ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగారాం అన్నారు. బుధవారం స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల్లో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్‌పాఠ శాలలకు పంపించకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఆయన సూచించారు. ప్రభు త్వ పాఠశాలల్లో ప్రభుత్వం అన్ని సదుపాయాలను విద్యార్థులకు కల్పిస్తుందని ఆయన అన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



అధికారులను సన్మానిస్తున్న సంఘ సభ్యులు

ఆదిలాబాద్‌అర్బన్,జూన్18(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టీఎన్జీవోస్ పక్షాన పోరాడతామని సంఘం జిల్లా అధ్యక్షుడు నందఅశోక్ అన్నారు. బీసీ, ఎస్సీ ఎస్టీ, వసతి గృహ సంక్షేమ అధికారుల సర్వసభ్య సమావేశంను బుధవారం టీఎన్జీవో సెంట్రల్ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నంద అశోక్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం నూతనంగా నియమితులైన వసతిగృహ సంక్షేమ అధికారులకు టీఎన్జీవో సభ్యత్వ నమోదు అందజేశారు. ఇందులో టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి నవీన్, ఎన్జీఓ సెంట్రల్ ఫోరం బాధ్యులు తిరుమల్‌రెడ్డి,వసతి గృహ సంక్షేమ అధికారుల సంఘం అధ్యక్షులు జె.నరసింహులు, సంక్షేమ అధికారులు సుజాత, ఓం ప్రసాద్, పర్వేజ్, చిన్నయ్య, జావేద్, రవి, సంధ్య, వసతి గృహ సంక్షేమ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సికిల్‌సేల్, తలసేమియాపై జాగ్రత్తగా ఉండాలి

సిరికొండ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సికిల్ సేల్, తల సేమి యాలు ప్రధానంగా వంశపారంపర్యంగా తల్లిదండ్రుల నుంచి పిల్లలకు సంక్రమించే వ్యాధులు కావున ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సిరికొండ కమ్యూనిటీ హెల్త్‌ఆఫీసర్ మహేష్, హెల్త్‌అసిస్టెంట్ గంగారం, ఏఎన్ఎం జారుబాయి అన్నారు. బుధవారం సిరికొండ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో తలసేమియాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఉచితంగా తలసేమియా పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సుశీల, గుగ్గిళ్ళస్వామి, ఆశవర్కర్ జ్యోతి పాల్గొన్నారు.

క్రికెట్‌లో సత్తా చాటిన గిరిజన యువకుడు

నేరడిగొండ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అండర్-19 క్రికెట్ పోటీలో గిరిజన యువకుడు జాదవ్ లక్కీ సత్తా చాటారు. ఇందిరా ప్రియదర్శిని క్రీడాప్రాంగణంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన అండర్-19 క్రికెట్ పోటీలలో ఆరెంజ్ జట్టుపై విజయం సాధించిన ఎల్లో జట్టు. ఎల్లో జట్టు గెలువడానికి జాదవ్ లక్కి బ్యాటింగ్‌లో సత్తా చాటారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారుడు జాదవ్ లక్కీని జిల్లా యువజన క్రీడల శాఖా అధికారి జక్కులశ్రీనివాస్, జిల్లా గిరిజన క్రీడలశాఖా అధికారి పార్థసారధిలు బహుమతులు అందజేశారు. నేరడిగొండ మండలం రాజురా గ్రామానికి చెందిన జాదవ్ లక్కీని మండల వాసులు అభినందనలు తెలిపారు.

వక్రమార్గం

(ఐదో పేజీ తరువాయి)

కార్డుల ఆధారంగా రిటైల్‌లో వివరాలను నమోదు చేస్తూ మళ్లీ వారి పేరిట బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ అమ్మేస్తున్నారు. అలాగే ఎవరికి అనుమానం రాకుండా వ్యాపారులు తెలివిగా వ్యవహరిస్తున్నారు. భీంపూర్ మండలంలో పట్టుబడిన యూరియా లారీ బిల్లులను పరిశీలిస్తే ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రైతుమిత్ర ఫర్టిలైజర్ షాపు నుంచి హోల్‌సెల్‌గా యూరియాను విక్రయించినట్లు తెలుస్తోంది. రైతుల పేరిట బిల్లులు చేసిన భీంపూర్ మండలం అందర్‌బంద్ సమీపంలో మహారాష్ట్రకు చెందిన మ్యాక్స్ ట్యాక్సీలో యూరియా బస్తాలను డంపు చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంత పెద్ద మొత్తంలో రైతులు యూరియాను కొనుగోలు చేసే అవసరమే అసలు ఉండదంటున్నారు. హోల్‌సెల్, రిటైల్ వ్యాపారి ఒక్కరే కావడంతో బిల్లులను తారుమారు చేస్తూ అమ్మేస్తున్నారు. దీనిపై సమగ్ర విచారణ చేపడితే మరికొంత మంది వ్యాపారుల బాగోతం బయటపడే అవకాశం ఉంటుంది.

చక్రం తిప్పుతున్న ఓ అధికారి..

పట్టణ పరిధిలో పని చేస్తున్న ఓ వ్యవసాయ శాఖాధికారి అక్రమ యూరియా రవాణా, నకిలీ విత్తనాల సరఫరాలో చక్రం తిప్పుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ అధికారికి ఓ ఉన్నత స్థాయి అధికారి అండదండలు ఉండడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో జైనథ్, బేల మండలాల్లో పట్టుబడిన నకిలీ బయోమందుల విక్రయాల్లోనూ ఈ అధికారికి హస్తం ఉన్నట్లు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. ప్రస్తుతం పట్టణ పరిధిలో విధులు నిర్వహిస్తూ బడావ్యాపారులతో చేతులు కలిపి అడ్డగోలు దందాకు తెరలేపుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. తాజాగా భీంపూర్ మండలంలో పట్టుబడిన యూరియా అక్రమ రవాణా వెనక ఆయన హస్తమే ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వ్యవసాయ శాఖాధికారుల క్షేత్ర స్థాయి పర్యవేక్షణ లేక పోవడంతోనే వ్యాపారులు అడ్డగోలుదందాలకు తెరలేపుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. యూరియా అక్రమ రవాణాలో వ్యాపారులతో పాటు అధికారుల హస్తం ఉన్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై లోతుగా దర్యాప్తు జరిపితే మరికొంత మంది అధికారుల అవినీతి బాగోతం బయటపడే అవకాశం ఉందంటున్నారు.

కాంగ్రెస్ పార్టీ కోసం యువత కష్టపడాలి



మాట్లాడుతున్న నాయకులు

నార్నూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : యువత కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి రాబోయే స్థానిక ఎన్నికల్లో అత్యధిక సీట్లు గెలిచేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలని నార్నూర్ మండల యువజన కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు షేక్ మహమ్మద్‌కు రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ రెడ్డి సలహాలు, సూచనలు ఇచ్చారు. బుధవారం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా మండల నాయకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ పార్టీ ఆసిఫా బాద్ ఉపాధ్యక్షుడు షేక్ నసీర్, మండల అధ్యక్షులు ముబ్బషీర్, హనుమంతు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండ

నార్నూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : భారీవర్షాల కారణంగా వారం రోజుల క్రితం గాదిగూడ మండలం పిప్రి గ్రామానికి చెందిన నలుగురు ఆదివాసీ గిరిజన ప్రజలు పిడుగులు పడి మృతిచెందారు. అభిమన్యు సౌజన్య గ్రూప్ అన్నివిధాలుగా సహకరిస్తుందని మెస్రం శేఖర్‌బాబు వారికి అండగా నిలిచారు. బుధవారం బాధితులను పరామర్శించి గోండ్వానా పంచాయతీ రాయి సెంటర్ సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు మెస్రం దురుగు పటేల్ అధ్యక్షతన దాతలు అందించిన రూ.లక్ష నాలుబై ఒక్క వేయి వంద నగదు రూపంలో భారీ ఆర్థికసహాయం అందించారు. కార్యక్రమంలో సిడాం జగుపటేల్, జుగ్నక్ భీంరావు, గాదిగూడ మండల సార్మేడి మండడి దౌలత్‌రావు, ఝురి సార్మేడి కోట్నాక్ దేవుశవ్, ఆత్రం నాగోరవు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా భవనాలు కూల్చి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు



కలెక్టర్ అభిలాష అభినవ్‌కు ఫిర్యాదు చేస్తున్న మాదిగ సంఘ సభ్యులు

లక్ష్మణచాంద, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో గల మాల సంఘ భవన సమీపంలో ఎస్సీ కార్పొరేషన్ దుకాణా సముదాయాన్ని, హరిజనవాడ ప్రభుత్వ పాఠశాలను కూల్చి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని కలెక్టర్ అభిలాష అభినవ్‌కు స్థానిక మాదిగ సంఘం సభ్యులు బుధవారం ఫిర్యాదు చేశారు. అంతకుముందు కలెక్టర్ కార్యాలయం ఎదుట, మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. తహసీల్దార్ సరితకు, ఎంపీడీవో రాధారాథోడ్‌లకు కూడా వినతిపత్రం ఇచ్చారు. అక్రమ నిర్మాణాన్ని వెంటనే ఆపాలని నినాదాలు చేశారు. దుకాణా సముదాయాన్ని కూల్చటం వలన స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కోల్పోయారని, ఒకే వర్గానికి సంబంధించిన వారు నిర్మాణం చేపట్టడం వలన తమ వాటా లేకుండా పోయిందని ఫిర్యాదులో తమ ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి అధికారులు, ప్రభుత్వం స్పందించి అట్టి నిర్మాణాలను ఆపాలని విన్నవించారు.

నిర్మాణానికి ఎలాంటి అనుమతి లేదు

మాల సంఘ భవనం ప్రక్కన జరుపుతున్న నిర్మాణానికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని స్థానిక గ్రామ పంచాయతీ కార్యదర్శి బుధవారం లిఖిత పూర్వకంగా వివరణ ఇచ్చారు. ఈ అక్రమ నిర్మాణాన్ని నిలిపి వేయాలని మంగళవారం నోటీసు కూడా జారీ చేసినట్లు వారు తెలిపారు.

నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించటమే కాంగ్రెస్ లక్ష్యం

లక్ష్మణచాంద, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించటమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని నిర్మల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్ అన్నారు. మండలంలోని మునిపెల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. రైతు భరోసా డబ్బులు అకౌంట్‌లో జమ అవుతున్న విషయాన్ని గుర్తు చేశారు.

ముఖ్యమంత్రి సహాయనిధి డబ్బుల అందజేత

మండలంలోని మునిపెల్లి గ్రామానికి చెందిన నూతికాడి మల్లవ్వ అనే లబ్ధిదారుకు రూ. 22,000ల సీఎం సహాయనిధి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు మాజీ ఉప సర్పంచ్ చిదుగు భీమ్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గురాల లింగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కమల్‌కోట రాజారెడ్డి, చింతకింది శేఖర్ రెడ్డి, దొడ నర్సారెడ్డి, గొర్రె గంగన్న, గొర్రె సాయికృష్ణ, షేక్ అమీర్, నూతికాడి లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంస్థాగత ఎన్నికల్లో సత్తాచాటాలి

కుభీర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : రానున్న సంస్థాగత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తాచాటాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ, ముధోల్ మాజీ ఎమ్మెల్యే భోస్లే నారాయణరావుపాటిల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బాలాజీ జిన్నింగ్ ఫ్యాక్టరిలో కుభీర్ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు శ్రీహరిరావు, మాజీ కేంద్రం మంత్రి వేణుగోపాలచారి, ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి హాజరై కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు.

నిజమైన నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్లు

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ● ఖానాపూర్ మున్సిపల్ పరిధిలో 86 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పత్రాల పంపిణీ

ఖానాపూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : నిజమైన నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్లు దక్కుతాయని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల పత్రాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలోని 12 వార్డుల పరిధిలో 86 మంది లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల పత్రాలను వారికి అందజేశారు. ఇందిరమ్మ ఇళ్లు మొదటి విడతలో రానివారు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. రెండవ విడతలో మిగతా వారికి ఇళ్లు దక్కుతాయన్నారు. పూర్తిగా నిరుపేదలను ఎంపిక చేసుకొని వారిలో కొందరికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని మిగతా వారికి సైతం ఇళ్లు మంజూరవుతాయన్నారు. అందరికంటే ముందుగా నాణ్యతతో నిర్మాణం చేసిన ఇంటి ప్రారంభోత్సవానికి తనతో పాటు మంత్రిని తీసుకొస్తానన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఎవరైనా బ్రోకర్లు వస్తే నమ్మవద్దన్నారు. ఇంటి నిర్మాణం ఎవరికి వారే చేసుకోవాలని లేనిచో మూకుమ్మడిగా ఎవరైనా నాణ్యతతో కూడిన నిర్మాణం చేస్తానని బాండ్ పేపర్ రాసిస్తే వారికి అప్పగిద్దామన్నారు. వాస్తవాలను ప్రజలకు కళ్లకు కట్టినట్లుగా చెబుతూ పాలన సాగిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని కొనియాడారు. రాష్ట్రంలో ఏ పథకం ప్రారంభించిన మొదటి ప్రాధాన్యత ఖానాపూర్‌కే దక్కుతుందని అందులో భాగంగానే ఇంటిగ్రేటెడ్ స్కూల్ సైతం మంజూరు అయిందన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్‌పై కొంతమంది విషప్రచారం చేస్తున్నారని ఖానాపూర్, కడెం, దస్తురాబాద్‌లలో స్థలం అందుబాటులో లేకపోవడంతోనే ఉట్నూరులో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ని నిర్మిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఇటీవల తన పుట్టిన రోజు సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఖానాపూర్‌లో డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని కోరినట్లు పేర్కొన్నారు.



ఖానాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల పత్రాలను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

ఖానాపూర్ మండల కేంద్రంలో శిథిలావస్థకు చేరిన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణం కోసం ఎమ్మెల్యే నిధుల నుండి రూ. 40 లక్షలు కేటాయిస్తానన్నారు. ఈ 86 ఇల్లే కాకుండా ఖానాపూర్ మండల కేంద్రానికి మొదటి విడతలోనే మరో 11 ఇళ్లను సైతం అదనంగా మంజూరు చేసున్నట్లు పేర్కొన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం జేకే నగర్‌లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేసి ఎమ్మెల్యే పనులు ప్రారంభించారు. ఈ వేరు వేరు కార్యక్రమాలలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మాజిద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికెని దయానంద్, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యం, మాజీ వైస్ చైర్మన్ కావలి సంతోష్, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు తోట సత్యం, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు శెట్టిశ్యామ్ మోహన్‌రావు తదితరులున్నారు.

ఖానాపూర్ పోలీసుస్టేషన్‌కు కొణతం దిలీప్ హాజరు



పోలీసుస్టేషన్‌లో సంతకం పెట్టేందుకు వచ్చిన కొణతం దిలీప్

ఖానాపూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వ డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్, సోషల్ మీడియా ఇన్‌చార్జి కొణతం దిలీప్ బుధవారం ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌కు హాజరయ్యారు. వివరాల్లోకి వెళ్తే బీఆర్ఎస్ లీగల్ సెల్ విభాగం న్యాయవాదులు తెలిపిన కథనం ప్రకారం... సోషల్ మీడియాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టు చేశారన్నా నెపంతో నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్, కడెంతో పాటు నిర్మల్ పోలీసుస్టేషన్‌లో దిలీప్‌పై కేసులు నమోదు చేశారు. కాగా ఈ నెల 11వ తేదీన నిర్మల్ పోలీసులు దిలీప్‌ను అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసినట్లు బీఆర్ఎస్ లీగల్ సెల్ విభాగం న్యాయవాదులు తెలిపారు. కాగా సదరు కేసులో ఛార్జ్‌షీట్ దాఖలు చేసే వరకు ప్రతి బుధవారం ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌కు హాజరై సంతకం చేసి వెళ్లాల్సిందిగా దిలీప్‌ను కోర్టు ఆదేశించినట్లు వారు పేర్కొన్నారు. కోర్టు ఆదేశాల మేరకు బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌కు హాజరు కావలసి ఉండగా దిలీప్ అరగంట ముందుగానే ఉదయం 11:30 గంటలకే ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారన్నారు. కాగా పోలీసులు మాత్రం సాయంత్రం 4:30 గంటల వరకు దిలీప్‌ను పోలీస్ స్టేషన్‌లోనే నిరీక్షింపజేశారని న్యాయవాదులు తెలిపారు. అధికారులు కక్ష సాధింపు ధోరణితో వ్యవహరించారని ఒకటి కాదు రెండు కాదు ఏకంగా నాలుగున్నర గంటల పాటు పోలీసుస్టేషన్‌లో నిరీక్షింపజేయడం పట్ల స్థానిక బీఆర్ఎస్ శ్రేణులతో పాటు ఆ పార్టీ లీగల్ సెల్ విభాగం న్యాయ వాదులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఖానాపూర్ పోలీసుస్టేషన్‌కు హాజరైన దిలీప్ వెంట బీఆర్ఎస్ లీగల్ సెల్ విభాగం న్యాయవాదులు లలితారెడ్డి, అమృత్‌రావు, అంబాల హరీష్, వెంకట్ మహేంద్ర, తోట సుమిత్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు రాథోడ్ రామునాయక్, కొక్కుల ప్రదీప్, గోరేకర్ రాజు, శనిగారపు శ్రావణ్, గజేందర్, దివాకర్, తదితరులున్నారు.

నసీరాబాద్ గ్రామం వద్ద పోలీసుల తనిఖీలు

నర్సాపూర్(జి), జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నసీరాబాద్ గ్రామం వద్ద పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా జాతీయ రహదారికి ఇరువైపులా నిలిపి ఉంచిన లారీలను తొలగించారు. ఈ సందర్భంగా పోలీసులు లారీ డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. డ్రైవర్లు తమ వాహనాలను నిర్ణీత పార్కింగ్ ప్రదేశాలలో మాత్రమే నిలపాలని, అత్యవసరమైతే తప్ప రోడ్లపై నిలపకూడదని సూచించారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనదారులు నిబంధనలను పాటించి పోలీసులకు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

ప్రమాద మృతుల కుటుంబాలకు బాసటగా నిలుస్తాం

భైంసా, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రమాదాల బారిన పడి మృతి చెందిన వ్యక్తుల కుటుంబాలకు ట్రస్టు ద్వారా ఆర్థిక సహాయం అందించి బాసటగా నిలుస్తామని మోహన్‌రావ్ పాటిల్ ప్రజా ట్రస్టు చైర్మెన్ బోస్లే మోహన్‌రావ్ పాటిల్ వెల్లడించారు. బుధవారం మండలంలోని సుంక్లి గ్రామంలో విద్యుదాఘాతం బారిన పడి మృతి చెందిన ముత్యం కుటుంబానికి ట్రస్టు తరఫున రూ.10 వేల ఆర్థిక సహాయంతో పాటు నిత్యావసర సరుకులను అందచేసిన సందర్భంగా మాట్లాడారు. ఇందులో సుంక్లి గ్రామ ప్రతినిధులు మోహన్, హరీష్, సత్యనారాయణతో పాటు పాల్గొన్నారు.

మేడిపల్లిలో 'ఇందిరమ్మ'కు భూమి పూజ

నిర్మల్ రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించడం జరుగుతుందని నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్‌రెడ్డి అన్నారు. బుధవారం నిర్మల్ మండలం మేడిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు ఆయన భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రతి లబ్ధిదారుడికి అందజేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల సంక్షేమానికి కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ రామ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పద్మాకర్, ఉప సర్పంచ్ భీమేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామ కార్యదర్శి, సంబంధిత ఇంజనీర్ పాల్గొన్నారు.

కౌలు రైతులకు ప్రభుత్వం గుర్తింపు కార్డును ఇవ్వాలి

సారంగాపూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : కౌలు రైతులందరికి ప్రభుత్వం గుర్తించి గుర్తింపు కార్డును ఇవ్వాలని రాష్ట్ర రైతు స్వరాజ్య వేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న అన్నారు. బుధవారం మండలంలో గల ఆలూర్‌లో, రైతు స్వరాజ్య వేదిక ఆధ్వర్యంలో కౌలు రైతుల సర్వే నిర్వహించి ఈ సందర్భంగా మాట్లాడారు. గత 2011లో కాంగ్రెస్ ప్రభుత్వం కౌలు రైతులకు ఆధికృత సాగుదారుల చట్టాన్ని తీసుకువచ్చి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రస్తుతం కౌలు రైతుల చట్టాన్ని ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందన్నారు. కార్యక్రమంలో రైతు స్వరాజ్య వేదిక బృంద సభ్యులు రమాకాంత్, రాకేష్, షారుక్, శివాఖర్, శ్రీనివాస్, మహేష్‌లు ఉన్నారు.

కార్మికుల హక్కుల రక్షణకై ఉద్యమించాలి

నిర్మల్ రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : కార్మికులకు హక్కుల రక్షణకై ఉద్యమించాలని టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి రాజన్న అన్నారు. పట్టణంలో బుధవారం టీయూసీఐ ఆధ్వర్యంలో బీడీ ఫ్యాక్టరీలో వాల్ పోస్టర్లను విడుదలచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కార్పొరేట్ శక్తులకు అనుకూల విధానాలను అనుసరిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలని, బీడీ పరిశ్రమపై విధించిన 28 శాతం జీఎస్టీ తగ్గించాలని కోప్టా చట్టం పేరుతో బీడీ పరిశ్రమ నిర్వీర్యం చేసేటటువంటి చర్యలను మానుకోవాలన్నారు. ఈ నెల 21న నిజామాబాద్ నగరంలో రాష్ట్ర సభలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కిషన్, పోశెట్టి, రాజేందర్, లక్ష్మణ్, రాజు, మురళి, నర్సయ్య, గంగామణి, లక్ష్మీ, విజయ, కమల, కవిత, అరుణ, శ్రీనివాస్, చిన్నయ్య, ఉత్తం, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పిల్లలకు పౌష్టికాహారం ఇవ్వాలి

దిలావర్‌పూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ పిల్లలకు పౌష్టికాహారం ఇవ్వాలని ఎంపీవో గోవర్ధన్ అన్నారు. బుధవారం కంజర్ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. అంగన్‌వాడీ రికార్డులను తనిఖీ చేశారు. పిల్లలకు పలక, బలపం పంపిణీ చేశారు.

ఇందిరమ్మ ఇళ్లపై అవగాహన

అనంతరం గ్రామ పంచాయతీ భవనంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై లబ్ధిదారులకు ఎంపీవో గోవర్ధన్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవాలని, ఎలాంటి మినహాయింపు ఉండదని లబ్ధిదారులకు సూచించారు. నిర్మాణంలో ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే నిధులు రావని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

కాల్వలో ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ

రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల నీడ కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి బుధవారం కాల్వ గ్రామంలో శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా 20 మంది లబ్ధిదారులకు పట్టాలను అందించారు. కార్యక్రమంలో కాల్వ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం చైర్మన్ అంగూర్ మహేందర్, పంచాయతీ కార్యదర్శి కిరణ్, మాజీ సర్పంచ్ నర్సారెడ్డి, లక్ష్మయ్య, శ్రీకాంత్, దమ్మ మహేష్, సుదర్శన్ పాల్గొన్నారు. బస్సపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పీఏసీఎస్ చైర్మన్ పీవీ రమణారెడ్డి భూమి పూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీవో గోవర్ధన్, హౌసింగ్, పంచాయతీ కార్యదర్శి ప్రవళిక, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



భైంసాలో కూలిపోయేస్థితిలోనున్న పోస్టాఫీస్ కార్యాలయ భవనం



భైంసాలో పురాతన ఇంటి గోడ పడిపోకుండా ఉండేందుకు అడ్డంగా పెట్టిన కర్రలు

శిథిలావస్థకు చేరిన భవనాలతో
పొంచి ఉన్న ముప్పు

- వర్షాలతో ముప్పు వాటిల్లే ప్రమాదం
- జిల్లాలో 100కు పైగా శిథిలావస్థ భవనాల గుర్తింపు
- కూల్చివేత చర్యలకు శ్రీకారం చుట్టిన మున్సిపల్ అధికారులు

భైంసా, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ పట్టణాలు, గ్రామాల్లో పురాతన భవనాలు, పెంకుటిళ్లు శిథిలావస్థకు చేరాయి. ఏ సమయంలో ఏ భవనం కూలుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. భవనాలు, పెంకుటిళ్లు కూలినప్పుడు వాటి వద్ద ఉన్న వ్యక్తులు మృతి చెందడం, గాయపడడం జరుగుతుంది. అయినా కూల్చకుండా ఉంచుతున్నారు. ఆయా భవనాల్లో ఎలాంటి జీవనం, వ్యాపారాలు జరగనప్పటికీ అలాగే దర్శనమిస్తున్నాయి. గత సంవత్సరం భారీ వర్షాల దాటికి పలు ప్రాంతాల్లో శిథిలావస్థలో ఉన్న భవనాలు, గోడలు కూలి పలువురు గాయపడడం జరిగింది. దీంతో మునిసిపల్ శాఖ జిల్లాలోని మున్సిపాలిటీల్లో శిథిలావస్థలో ఉన్న భవనాలను కూల్చివేయాలని ఆదేశాలను జారీ చేసింది. ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలోని మూడు మున్సిపాలిటీల్లో అధికారులు శిథిలావస్థ దశలోని భవనాలు, పెంకుటిళ్లను గుర్తించి వాటిని కూల్చివేసే చర్యలకు శ్రీకారం చుట్టారు. భైంసా మున్సిపాలిటీలో ఇప్పటికే రెండు శిథిలావస్థ దశలోని ఇళ్లు, భవనాలను అధికారులు కూల్చివేయించారు. మిగతా ప్రాంతాల్లోనూ అధికారులు శిథిలావస్థ దశకు చేరుకున్న వాటిని గుర్తించి కూల్చివేసే దిశగా చర్యలను ప్రారంభించారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో భారీగా వర్షాలు కురిస్తే శిథిల భవనాలు, పెంకుటిళ్లు ప్రమాదం బారిన పడే పరిస్థితులు నెలకొని ఉన్నాయి.

● జిల్లాలో 100కు పైగా భవనాల గుర్తింపు

ప్రభుత్వం ఆదేశాల మేరకు మునిసిపల్ అధికారులు జిల్లాలోని నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపల్ కేంద్రాలలో దాదాపు 100కు పైగా శిథిలావస్థకు చేరిన భవనాలను, నివాస గృహాలను గుర్తించారు. ఇందులో ప్రభుత్వ శాఖలకు చెందిన, ప్రైవేట్ వ్యక్తులకు సంబంధించిన భవనాలు, పెంకుటిళ్లు ఉన్నాయి. భైంసా పట్టణ పరిధిలో 22 భవనాలు శిథిలావస్థ దశకు చేరుకొని ప్రమాదకరంగా మారినట్లుగా వాటిని గుర్తించారు. ఇందులో నుంచి రెంటింటిని ఇక్కడి మున్సిపల్ అధికారులు కూల్చివేయించారు.మిగతా ప్రాంతాల్లో సంబంధిత ప్రక్రియ అమలు కోసం గాను అక్కడి మున్సిపల్ అధికార యంత్రాంగం సంబంధిత భవనాలు, పెంకుటిళ్ల యజమానులకు నోటీసులు జారీచేశారు. కాగా భవనాలను కూల్చివేయాలంటే వాటి నాణ్యతను మునిసిపల్ ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించి జారీచేసే ధ్రువీకరణపై ఆధారపడాల్సి ఉంది. శిథిలావస్థలో ఉన్న భవనాలను అధికారులు తొందరగా పరిశీలించి వాటిని కూల్చాలో, లేదో ధ్రువీకరణ చేస్తే ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా చర్యలు చేపట్టే అవకాశాలున్నాయి.



భైంసాలో పురాతన ఇంటికి ప్లాసిక్ కవర్ కప్పిన దృశ్యం

● చర్యలు తీసుకుంటున్నాం..

అనురాధ, టౌన్ ప్లానింగ్ అధికారిణి, మున్సిపల్, భైంసా

భైంసా మున్సిపల్ పరిధిలో శిథిలావస్థకు చేరిన 22 ఇళ్లు, భవ నాలను గుర్తించాం. ఇంజనీరింగ్ అదికారుల ద్వారా సంబంధిత భవ నాల నాణ్యత నిర్ధారించే చర్యలు చేపట్టాం. ఇందులో నుంచి రెండింటిని కూల్చి వేయించారు. మిగతా వాటి గురించి త్వరలోనే నిర్ణయం తీసుకుంటాం. ఈలోపు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా శిథిలావస్థకు చేరిన భవనాల ఇంటి యజమానులకు నోటీసులు జారీ చేస్తాం .

వైభవంగా ముత్యాల పోచమ్మ వార్షికోత్సవ వేడుకలు

● తొలి రోజు అమ్మవారికి ఘనంగా జలాభిషేకం



ఖానాపూర్‌లో నది జలాల ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం



ఖానాపూర్‌లో ఉత్తర వాహిని గోదావరి నది తీరంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఖానాపూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని అంబేద్కర్ నగర్ కాలనీలో బుధవారం ముత్యాల పోచమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా ప్రారంభ మయ్యాయి. ఈ వేడుకల్లో భాగంగా తొలి రోజు అమ్మవారికి ఘనంగా జలాభిషేకం నిర్వ హించారు. నది జలాల కోసం ప్రతీ ఇంటి నుంచి నీటి కడువలతో తరలివచ్చిన మహిళలు పట్టణ శివారులోని ఉత్తర వాహిని గోదావరి నది నుంచి జలాలను ఊరేగింపుగా తీసుకు వచ్చారు. నది జలాల ఊరేగింపుకు మహిళలతో పాటు కాలనీలోని యువత, కాలనీ పెద్దలు భారీగా తరలివెళ్లారు. గోదావరి నది తీరంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడి నుంచి నది జలాలను ఊరేగింపుగా తెచ్చి అమ్మవారి మూలవిరాట్‌కు జలాభిషేకం నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మాజిద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దయానంద్, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, మున్సిపల్ మాజీ చైర్మన్ చిన్నం సత్య నారాయణ, వైస్ చైర్మన్ సంతోష్, జిల్లా నాయకులు పరిమి సురేష్, ద్యావతి రాజేశ్వర్, తదితరులున్నారు. ఈ వేడుకలకు హాజరైన భక్తులకు ఎటువంటి ఇక్కట్లు తలెత్తకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు, కాలనీ వాసులు జన్నారపు శంకర్, గొర్రె గంగాధర్, మ్యాదరి రాజేశ్వర్, కుంటాల రాజన్న, మేసు గంగేష్, మద్దెల భూమన్న, మునుగురి భూమన్న, దాసరి రాజేశ్వర్, దండు రాజేశ్వర్, చెట్‌పెల్లి మోహన్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాలు వేస్తున్న విద్యార్థినులు

బోథ్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): యోగ వల్ల సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందని యోగ ఇన్‌స్పెక్టర్ మునిగేల యోగిత పేర్కొన్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో యోగ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని కళాశాలలో యోగాసనాలు వేయించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యానికి యోగ అవసరమని పేర్కొన్నారు. మానసిక ప్రశాంతత ఆత్మస్థైర్యానికి యోగా ఉపయోగపడుతుందన్నారు. సీజనల్ వ్యాధులను యోగా ద్వారా అరికట్టవచ్చన్నారు. యోగ సాధన ద్వారా దురలవాట్లకు దూరంగా ఉండవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సంగీత మాట్లాడుతూ యోగా ఆరోగ్యానికి మంచిదని పరీక్ష ల సమయంలో విద్యార్థులు యోగాసనాల వల్ల చురుగ్గా ఉంటా రన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ లత, పీఈటీ రాజ్యలక్ష్మీ పాల్గొన్నారు.

ప్రైవేట్ నుంచి ప్రభుత్వ పాఠశాలలో కుమారున్ని చేర్పించిన ఉపాధ్యాయుడు



తన కుమారున్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తున్న ఉపాధ్యాయుడు

ఉట్నూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగించేలా ప్రభుత్వ టీచర్లు తమ పిల్లలను పాఠశాలల్లో చేర్పించుకోవాలని ప్రభుత్వం ఆదేశించడంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ టీచర్లు తమ పిల్లలను పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ఉట్నూర్ మండలంలోని శ్యామ్‌పూర్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న రాథోడ్ రవీందర్ తన కుమారుడు రాథోడ్ వరుణ్ నాయక్‌ని బుధవారం ప్రైవేట్ పాఠశాల నుంచి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.మల్లయ్య ఆధ్వర్యంలో శాంపూర్ ప్రాథమిక పాఠశాలలో 3వ తరగతిలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ భరత్ చౌహాన్, గ్రామపెద్దలు మేడి మల్లయ్య, కాటం రమేష్, మాజీ సర్పంచ్ జాదవ్ జగదీశ్, రాములు పాల్గొని టీచర్ రవీందర్‌ని అభినందించారు.



దత్తాత్రేయ మూర్తి విగ్రహం



సాయిబాబా మూర్తి విగ్రహం

వైభవంగా వార్షికోత్సవ వేడుకలు

● రేపు గండి రామన్న క్షేత్రంలో ప్రత్యేక పూజలు

నిర్మల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ పట్టణంలోని గండి రామన్న క్షేత్రంలో కొలువుదీరిన సాయిబాబా ఆలయం మూడో వార్షికోత్సవానికి సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఆలయంలోని సాయిబాబా విగ్రహంతో పాటు దత్తాత్రేయుని పాత విగ్రహాల స్థానంలో కొత్త విగ్రహాలను ప్రతిష్టించి ఈ నెల 20తో మూడేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించనున్నారు. సాయి దీక్ష సేవా సమితి అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్ రెడ్డి, జైపాల్ రెడ్డి సోదరులు తమ సొంత ఖర్చులను వెచ్చించి మూడేళ్ల క్రితం విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించిన సంగతి తెలిసిందే. నాటి నుండి ప్రతి సంవత్సరం విగ్రహ ప్రతిష్ఠాపన వార్షికోత్సవాన్ని నిర్వహిస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 20న శుక్రవారం ప్రత్యేక పూజలతో పాటు ఆలయ ప్రాంగణంలో యజ్ఞ, హోమ కార్యక్రమాలను నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను దే వాదాయశాఖ ఆధ్వర్యంలో పూర్తి చేశారు. అలాగే ఉదయం 5:30 నిమిషాలకు ఆల యంలో నిర్వహించే అభిషేకంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

రోడ్డుపైకి వస్తున్న మురికి నీరు

● గుంతలమయంగా ఆర్ అండ్ బి రోడ్డు

బోథ్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలోని కోరమండల్ ఎరువుల దుకాణం ముందు మురికి నీరు కాలువ నుండి రోడ్డుపైకి రావడంతో ద్విచక్ర వాహనాల వారికి, ఆటోల వారికి ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో మురికి నీరు రోడ్డుపైకి రాకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. అనంతరం యధావిధిగా కాలువ కూడుకుపోయి రోడ్డుపై నీరు ప్రవహిస్తున్నాయి ఫలితంగా రోడ్డు గుంతల మయంగా మారుతుంది. అధికారులు రోడ్డుపైకి నీరు రాకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డు పైకి వస్తున్న మురికి నీరు

కూలిన పాఠశాల భవనం



మర్లపల్లి గ్రామంలో కూలిన పాఠశాల భవనం

బోథ్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మరలపల్లి గ్రామంలో ఉన్న పాత ప్రభుత్వ పాఠశాల భవనం ఇటీవల కురిసిన వర్షాలకు కూలిపోయింది. నూతనంగా నిర్మించిన భవనంలో విద్యాబోధన కొనసాగుతుండగా పాత భవనం కూలిపోయింది. పాఠశాలలో విద్యార్థులకు సరి పోయేంత గదులు లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారని గ్రామస్థులు అంటున్నారు. పాత పాఠశాల భవనం స్థానంలో పాఠశాల భవనాన్ని నిర్మించాలని కోరుతున్నారు.





దుకాణాలలో స్టేషనరీ కొనుగోలు చేస్తున్న విద్యార్థులు

బుక్‌స్టాళ్లలో సందడి



విద్యా సంస్థల ప్రారంభం కావడంతో పట్టణంలోని వివిధ దుకాణాలు కళకళలాడుతున్నాయి. పాఠ్య, నోట్ పుస్తకాలు, దుస్తులు, బ్యాగులు, బూట్లు ఇలా విద్యార్థులకు అవసరమైన సామగ్రి కొనుగోలులో కుటుంబ సభ్యులు రావడంతో ఆయా దుకాణాల్లో సందడి నెలకొంది. కొందరు విద్యార్థులు వారి తల్లిదండ్రులతో రాగా మరికొందరు అమ్మమ్మ, నాన్నమ్మ, తాతయ్యలతో వచ్చి సామగ్రి కొనుగోలు చేస్తున్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని వివిధ దుకాణాల్లో బుధవారం కనిపించిన చిత్రమే ఇది.

● ఆంధ్రజ్యోతి,స్టాఫ్ ఫొటో గ్రాఫర్, ఆదిలాబాద్

ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది విందుపై జిల్లా అధికారుల ఆరా..!

● విందుకు హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



ఈ నెల 14న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం (ఫైల్)

ఖానాపూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 13వ తేదీన జిల్లాలోని అడెల్లి పోచమ్మ ఆలయ ప్రాంగణంలో ఖానాపూర్ ఉపాధి హామీ సిబ్బంది నిర్వహించిన దావత్‌పై జిల్లా అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. పని దినాన్ని సైతం పక్కన పెట్టి సామూహికంగా అంతా కలిసి దావత్ చేసుకునేందుకు వెళ్లడమే కాకుండా సదరు ఫోటోలను సోషల్ మీడియాలో అప్లోడ్ చేసిన ఖానాపూర్ ఉపాధి హామీ సిబ్బంది తీరుపై ప్రజలు మండిపడుతున్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేర వేడయంలో కీలక పాత్ర పోషించే ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు పని దినాన్ని సైతం లెక్క చేయకుండా విందు భోజనాలకు వెళ్లడంపై మండల వ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉపాధి హామీ ఏపీవో సహా టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ విభాగం సిబ్బంది మొత్తంతో పాటు ఎంపీడీవో ఈ విందు భోజనాలకు హాజరు కావడం వివాదాస్పదంగా మారుతోంది. కిందిస్థాయి సిబ్బంది తప్పు చేస్తే హెచ్చరించాల్సిన స్థానంలో ఉన్న ఎంపీడీవో స్థాయి అధికారి తాను సైతం ఏపీవో పండగ చేస్తే అడెల్లికి వెళ్లి తిని వచ్చానని చెప్పడం పట్ల పలువురు మండిపడుతున్నారు. సంబంధిత ఘటనకు కారకులైన వారిపై వెంటనే శాఖా పరమైన చర్యలు తీసుకోవాలనే డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం సహా ఇంటలిజెన్స్ ఈ ఘటనపై ఆరా తీస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. 'విధులకు ఎగనామం పెట్టి విందు భోజనాలకు' అనే శీర్షికన ఈ నెల 14వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురిత మైన కథనంలో ఈ సామూహిక విందు భోజనాల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ విందు భోజనాల సమావేశం వెనుక పంపకాలతతంగం జరిగినట్లు ప్రచారం జరుగుతోంది. క్షేత్ర స్థాయిలో ఉపాధి హామీ కూలీల నుండి సేకరించిన డబ్బులను పంచుకు నేందుకే ఈ ప్రత్యేకమైన దావత్‌ను ఏర్పాటు చేసినట్లు చెబుతున్నారు. ఈ పంపకాల కోసమే అందరూ మూకు మ్మడిగా కార్యాలయాన్ని వదిలి అడెల్లి దావత్‌కి తరలి వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది.

పాఠశాల పట్ల కృతజ్ఞతను చాటుకున్న పూర్వ విద్యార్థులు



నర్సాపూర్ జడ్పీ పాఠశాలలో బ్లాక్ బోర్డులను వితరణ చేస్తున్న దృశ్యం

నర్సాపూర్(జి), జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998-1999 విద్యా సంవ త్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు తమ పాఠశాల పట్ల తమ ప్రేమను, కృతజ్ఞతను చాటుకున్నారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన బడికి ఏదో ఒకటి తిరిగి ఇవ్వాలనే తపనతో వారు రూ. 32,000లు విలువ చేసే నాలుగు అత్యాధునిక బ్లాక్ బోర్డులను (ఒక్కొక్కటి రూ. 8,000లు విలువ) వితరణ చేశారు. ఈ అద్భుతమైన కార్యక్రమానికి తహసీల్దార్ శ్రీకాంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ పాఠశాలకు ముఖ్యఅతిథిగా రావడం ఇది రెండవసారి అని ఆయన గుర్తు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాము చదువుకునే రోజుల్లో పెన్సిల్, పెన్నులు కొనడం కూడా భారంగా ఉండేదని, అలాంటిది పూర్వ విద్యార్థులు తమ పాఠశాలకు ఇంత గొప్ప సహాయం చేయడం నిజంగా ప్రశంసనీయమని ఆయన అన్నారు. అనంతరం తహసీల్దార్ పాఠశాలలో మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. పూర్వ విద్యార్థి జాదవ్ మోతిలాల్ పటేల్ మా ట్లాడుతూ... ఉపాధ్యాయులు శివ లింగయ్య నేర్పిన పాఠాలు, ప్రయోగశాలలో నేర్చుకున్న జ్ఞానం తమను విజ్ఞానులుగా చేసిం దని గుర్తు చేసుకున్నారు. చదువును ఎవరూ దొంగిలించలేరని, విద్య నేర్పిన గురువులను ఎప్పటికీ మర్చిపోకూడదని ఆయన నొక్కి చెప్పారు. స్థానిక ఎస్సై సాయి కిరణ్ మాట్లాడుతూ... బడి నాకేం ఇచ్చిందని కాకుండా మనం బడికి ఎంతో కొంత తిరిగి ఇవ్వాలని విద్యార్థులకు సూచించారు. ఈ స్ఫూర్తిదాయక కార్యక్రమంలో 1998-1999 బ్యాచ్ పూర్వ విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు, ఇతర ఉపాధ్యాయులు, ప్రస్తుత విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విరిగిన విద్యుత్ స్తంభం

● పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు

బోథ్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలోని ఆదర్శ పాఠశాల సమీపంలో విద్యుత్ స్తంభం సగానికి విరిగిపోయింది. గాలిలో వేలాడుతుంది. ఆదర్శ పాఠశాల విద్యార్థులు విరిగిన విద్యుత్ స్తంభం సమీపంలో ప్రతీరోజు ఆగుతారు. దీంతో చిన్న పిల్లలకు విద్యుత్ షాక్ తగిలే ఆస్కారం ఉందని పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు.



ఆదర్శ పాఠశాల ఎదురుగా జరిగిన విద్యుత్ స్తంభం



ఎట్టకేలకు గట్టెక్కిన కొనుగోలు

ఖానాపూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ఎక్కడ చూసినా జిల్లాలో గత రెండు నెలలుగా అన్నదాతల ఆందోళనలు వెల్లువెత్తాయి. కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల నిర్బంధాలు కనిపించాయి. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతూ అన్నదాత అవస్థలు పడ్డారు. ప్రకృతి ప్రకోపానికి నీటి పాలైన ధాన్యం రాశుల్లో మొలకెత్తిన ధాన్యాన్ని చూసి అన్నదాత కన్నీరు పెట్టుకున్నాడు. ఇటువంటి ఎన్నో బాధాకరమైన ఘట్టాలకు వేదికగా నిలిచిందీ ఈ యాసంగి ధాన్యం కొనుగోళ్లు. ఎట్టకేలకు గట్టెక్కింది అనిపించిందీ యంత్రాంగం. జిల్లాలో ఏప్రిల్ మాసంలో ప్రారంభమైన ధాన్యం కొనుగోళ్లు ముగిశాయి. జిల్లావ్యాప్తంగా ఐకేపీ, పీఏసీఎస్, ఎఫ్‌పీసీఎస్, జీసీసీ ఆధ్వర్యంలో ప్రభుత్వం 262 ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహించింది. ఈ కొనుగోలు కేంద్రాల ద్వారా ఈ ఏడాది జిల్లాలో పండించిన ధాన్యం కొనుగోళ్లను కొన్ని ఒడిదుడుకుల నడుమ అధికార యంత్రాంగం పూర్తి చేసింది.

అమ్మకాల్లో రైతన్నకు తప్పని తరుగు తిప్పలు

జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల సమయంలో రైతన్నకు తరుగు తిప్పలు తప్పలేదు. కొంతమంది సెంటర్ నిర్వాహకులు జిల్లాలోని మిల్లర్లతో కుమ్మక్కై రైతన్న వద్ద ధాన్యం దోపిడీకి పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఒక్కో క్వింటాల్‌కు సుమారు ఐదు నుంచి ఏడు కిలోల వరకు అదనపు ధాన్యాన్ని తూకం వేసి ఒకదశలో రైతుల ఆగ్రహాన్ని చవిచూశారు. ఖానాపూర్ మండలంలోని ఎర్వచింతల్‌లాంటి గ్రామంలో ఏకంగా పీఏసీఎస్ అధికారిని, సిబ్బందిని నిర్బంధించి రైతులు తమ ఆగ్రహాన్ని ప్రదర్శించారు. ఖానాపూర్, మామడ, కడెం, దస్తురాబాద్ సహా పలు జిల్లాల్లో రైతన్న రోడ్డెక్కి ఆందోళన చేయాల్సిన పరిస్థితి తలెత్తింది. బీహార్ లాంటి ప్రాంతాల నుంచి తమ చెప్పు చేతుల్లో ఉండే కూలీలను తెచ్చుకొని వారికి తక్కువ ధరను చెల్లించి రైతుల వద్ద క్వింటాల్ వెంబడి 10 రూపాయలను అదనంగా దోచుకుని సెంటర్ నిర్వాహకులు చేతివాటాన్ని ప్రదర్శించారు. వారిని అధికారులు వారిని నిలువరించడంలో విఫలమయ్యారని ఆరోపణలు వినిపించాయి.



మొలకెత్తిన ధాన్యాన్ని చూపుతున్న రైతు (ఫైల్)

అవస్థల పాలు చేసిన అకాలవర్షాలు

జిల్లాలో యాసంగిలో పండించిన ధాన్యాన్ని విక్రయించే సమయంలో ప్రకృతి సైతం రైతన్నపై పగబట్టినట్లు తన ప్రకోపాన్ని ప్రదర్శించింది. అకాలవర్షాలతో హోరెత్తించింది. ఈ అకాల వర్షాలకు పంట కల్లాల్లోని ధాన్యం తడిసి ముద్దవ్వడమే కాకుండా కొన్ని చోట్ల మొలకలు వచ్చిన పరిస్థితి తలెత్తింది. దీంతో ఆరుగాలం శ్రమించి పండించిన పంట తమ కళ్ళ ముందు నీటి పాలవుతుంటే అన్నదాత ఆవేదన వర్ణనాతీతంగా మారింది. ఇక తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు రైతన్న కొనుగోలు కేంద్రాల్లో పడిన కష్టం అంతా ఇంత కాదు. ధాన్యం ఆరబెట్టడం ఒక ఎత్తు అయితే ఆ తడిసిన ధాన్యాన్ని విక్రయించడం మరో ఎత్తుగా మారింది. ఎన్నో నిబంధనల నడుమ తడిసిన ధాన్యాన్ని రైతన్న అమ్ముకోవాల్సిన పరిస్థితి తలెత్తింది. ఓవైపు సెంటర్ నిర్వాహకుల చేతివాట మరోవైపు ప్రకృతి ప్రకోపం రైతన్నను అతలాకుతలం చేసి అవస్థల పాలు చేసింది.

రికార్డు స్థాయిలో ధాన్యం సేకరణ

జిల్లాలో గత యాసంగిలో రైతాంగం 1.15 లక్షల ఎకరాలలో వరి పంటను సాగు చేశారు. రైతులు సాగు చేసిన వ్యవసాయ భూమి ఆధారంగా ఈసారి యాసంగిలో 1.62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే జిల్లాలో ఏర్పాటు చేసిన 262 కొనుగోలు కేంద్రాలకు గతానికి భిన్నంగా ఈ యాసంగిలో 1,84,500ల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ర ఆవడంతో వచ్చిన ధాన్యాన్నంతా కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం సేకరించింది. రికార్డు స్థాయిలో ఈ యాసంగి లక్ష్యానికంటే అదనంగా 22,086 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం ద్వారా అవస్థలు ఎదుర్కొన్న రైతులకు కాస్త ఉపశమనం కలిగించారు.

రైతుల ఖాతాల్లో రూ. 263 కోట్లు జమ

జిల్లా వ్యాప్తంగా 262 కొనుగోలు కేంద్రాల్లో 41,048 మంది రైతులు 1,84,500ల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని విక్రయించినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ ధాన్యానికి గాను మొత్తం రైతుల ఖాతాల్లో రూ. 430 కోట్లు జమ కావాల్సి ఉండగా ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 27,168 మంది రైతుల ఖాతాల్లో రూ. 263 కోట్లు జమ అయినట్లు అధికారులు చెబుతున్నారు. మరో 13,880 మంది రైతుల ఖాతాల్లో రూ. 167 కోట్లు జమ కావాల్సి ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. సన్న రకం ధాన్యం విక్రయించిన రైతులకు ధాన్యం డబ్బులతో పాటు బోనస్ డబ్బులు క్వింటాల్‌కు రూ. 500ల చొప్పున జమ చేస్తున్నట్టు చెబుతున్నారు. ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న మిగతా రైతుల ఖాతాల్లో సైతం వారం రోజుల లోపల డబ్బులు జమ చేయనున్నట్లు అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల చేతివాటంతో ఇబ్బంది పడిన రైతులకు ప్రకృతి సైతం పగబట్టినట్లు చేయగా తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించి అన్నదాతకు అధికార యంత్రాంగం చివరిలో అండగా నిలిచింది. కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న దోపిడీని అరికట్టడంలో విఫలమవుతున్నారని ఆరోపణలు ఎదుర్కొన్న అధికార యంత్రాంగం చివరకు తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ మిల్లులకు తరలించడంతో పాటు లక్ష్యానికి మించి ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల అభిమానాన్ని చురగొంది. ఇలా మొత్తానికి ఈ యాసంగి ధాన్యం కొనుగోళ్లు మిశ్రమ అనుభవాన్ని మిగులుస్తూ ఎట్టకేలకు గట్టెక్కాయి.

- యాసంగి కొనుగోళ్లలో రైతన్నకు తప్పని తరుగు తిప్పలు
- ప్రకృతి ప్రకోపానికి అన్నదాత విలవిల
- అయినా జిల్లాలో రికార్డుస్థాయిలో ధాన్యం సేకరణ
- లక్ష్యాన్ని మించి 22,086 మెట్రిక్ టన్నుల ధాన్యం అదనంగా కొనుగోలు
- 262 కొనుగోలు కేంద్రాల్లో 1,84,500ల మెట్రిక్ టన్నుల ధాన్యం విక్రయించిన 41,048 మంది రైతులు
- ఇప్పటి వరకు 27,168 మంది రైతుల ఖాతాల్లో రూ. 263 కోట్లు జమ
- 13,880 రైతులకు రావాల్సిన రూ. 167 కోట్లు పెండింగ్

విపత్తు రక్షణ చర్యలపై

అందరూ అవగాహన పెంచుకోవాలి

- ఎస్పీ డా. జానకీషర్మిల



రెస్క్యూబోట్‌పై అవగాహన కల్పిస్తున్న డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రతినిధి

భైంసా, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) ; విపత్తుల సమయంలో తమను తాము రక్షించుకోవడంతో పాటు ఇతరులను రక్షించే చర్యలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఎస్పీ డా.జానకీషర్మిల సూచించారు. బుధవారం భైంసా పట్టణంలోని గడ్డెన్న ప్రాజెక్టు వద్ద డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించే చర్యలపై మాక్ డ్రిల్, శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఎవరికి వారే తమ రక్షణకు కొన్ని జాగ్రత్తలు తప్పకుండా తీసుకోవాలన్నారు. అన్ని వేళలా పోలీసు, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు అందుబాటులో ఉండవన్నారు. విపత్తులు ఏర్పడినపుడు సంభవించే ప్రమాదాల్లో చిక్కుకున్న సమయంలో రక్షించుకునే చర్యలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించే చర్యలపై పోలీసులకు అవగాహన కల్పించారు. ఎమర్జెన్సీ రెస్క్యూ బోట్ ద్వారా గడ్డెన్నవాగు ప్రాజెక్టు నీటిలో వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించే చర్యలపై మాక్‌డ్రిల్ ద్వారా శిక్షణనిచ్చారు. ఇందులో భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్, టౌన్ సీఐ గోపినాథ్,ఎస్‌ఐ గౌస్‌లతో పాటు పట్టణ పోలీసుల, ప్రత్యేక పోలీసు బలగాలు పాల్గొన్నాయి.

కుభీర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కల్యాణ్



నూతన ఏఎంసీ కమిటీని అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

కుభీర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : కుభీర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బుధవారం గోనెలు కల్యాణ్ నియమితులయ్యారు. దాదాపు రెండు సంవత్సరాల కాలంగా వాయిద పడుతూ వస్తున్న కుభీర్ మార్కెట్ కమిటీ ఖరారు అయింది. ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ప్రధాన అనుచరుడైన తెలంగాణ ఉద్యమకారుడు గోనెలు కళ్యాణ్‌ను నియమించినట్లు ఉత్తర్వులు అందించారు. చైర్మన్‌తో పాటు వైస్ చైర్మన్ ఎస్‌కే హైమ్మద్‌తో, 14 మంది సభ్యులు వెన్నెల సతీష్, గోనె జ్ఞానేశ్వర్, చెర్ల విఠల్, ఆకుల వెంకటేశ్, రాథోడ్ అరుణ్‌కుమార్, గుర్రపు సత్యనారాయణ, ప్రహ్లాద్ హెడ్కె, బేంద్రి సత్యనారాయణ, జిడ్డే ఓంకార్, సర్దార్ రాజాసింగ్, అర్గుల విఠల్, బి. రమేష్‌లు కమిటీ సభ్యులుగా ఖరారు చేశారు. కమిటీ పదవీకాలం రెండు సంవత్సరాల పాటు కొనసాగనుంది. వారిని మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి శాలువ పూల మాలతో సత్కరించారు. అనంతరం ఏఎంసీ చైర్మన్ గోనెలు కల్యాణ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఏఎంసీ చైర్మన్ పదవి అందించినందుకు మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు విజయ్‌కుమార్, మాజీ ఏఎంసీ చైర్మన్ కందూర్ సంతోష్, రహూఫ్, మహిపాల్‌రెడ్డి, సూది రాజన్న, డా పెంటాజీ, జావిద్‌ఖాన్, సంజయ్, సాయినాథ్ పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి

- రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు నాయక్వాడి అపర్ణ




సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు

నిర్మల్ రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : రానున్న రోజుల్లో బూత్ లెవెల్‌లో మహిళా కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు జిల్లా ఇన్‌చార్జి నాయక్వాడి అపర్ణ, రాష్ట్ర జనరల్ సెక్యూరిటీ శోభారాణిలు అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దుర్గాభవాని, జిల్లా వైద్య ప్రెసిడెంట్ లక్ష్మీ, తాండూర్ మండల అధ్యక్షులు సంగీత, దిలావర్‌పూర్ మండల అధ్యక్షులు సుమలత, నిర్మల్ మండల అధ్యక్షులు గుమ్మల జ్యోతి, మండల అధ్యక్షురాలు సురేఖ, వైస్ ప్రెసిడెంట్ నుస్రత్ ఫాతిమా, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరూ పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలి

డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు

భైంసా రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : భైంసా పట్టణంలో బుధవారం కాంగ్రెస్ మండల స్థాయి కార్యకర్తలతో డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మండలంలోని ప్రతి కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీ కోసం కష్టపడి పని చేయాలన్నారు. సంస్థాగత ఎన్నికలు సన్నాహక సమావేశానికి వచ్చిన అందరికీ సీనియర్లు, జూనియర్లు తేడా లేకుండా కష్టపడి పార్టీ కోసం పని చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, నారాయణరావు పటేల్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్, మాల మండల కాంగ్రెస్ కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ నుంచి మహోర్‌కు బస్సు సౌకర్యం : డీఎం పండరి

నిర్మల్ రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ నుంచి పవిత్ర క్షేత్రాలు అయిన రేణుకమాత, దత్తాత్రేయ, అనసూయ మాత దేవాలయాలకు నిలయమైన మహోర్‌కు బస్సు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కే. పండరి తెలిపారు. నిర్మల్ నుండి మహోర్ ఉదయం, మధ్యాహ్నం రెండు ట్రిప్పులు బస్సు నడుస్తుందని తెలిపారు. ఉదయం బస్సుకు వెళ్లిన వారు సాయంత్రం బస్సుకు దర్శనాలు చేసుకొని తిరిగి రావచ్చని ఆయన తెలిపారు. ఈ బస్సులో మహిళలకు తెలంగాణ బార్డర్ వరకు ఆధార్ కార్డుపై ఉచిత ప్రయాణం వర్తిస్తుందని ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని డిపో మేనేజర్ తెలిపారు.

ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు మేలు

దిలావర్‌పూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్ పామ్‌సాగుతో రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చని నిర్మల్ డివిజన్ ఉద్యాన శాఖ అధికారి మౌనిక అన్నారు. ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్‌లో భాగంగా బుధవారం దిలావర్‌పూర్ మండలంలోని బన్సపల్లిలో పుండ్రు రాజేశ్వర్ రెడ్డి భూమిలోని 2.20 ఎకరాలలో ఆయిల్ పామ్ మొక్కలను నాటే కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం ఆమె గుండంపల్లిలో సాగు చేస్తున్న ఆయిల్ పామ్ తోటలను పరిశీలించారు. ఆయిల్ పామ్ రైతులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ పామ్ రైతులు పాల్గొన్నారు.

రైతులకు బాసటగా రైతు భరోసా

- వానాకాలం ప్రారంభానికి ముందే రూ. 112.86 కోట్ల నిధుల జమ
- కలెక్టర్ అభిలాష అభినవ్



నిర్మల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : వానాకాలం సీజన్‌కు ముందే రైతుల ఖాతాల్లోకి నిధులు జమ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం రైతులకు బాసటగా నిలుస్తోందని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. వ్యవసాయాన్ని పండుగలా మార్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని పేర్కొన్నారు. వానాకాలం 2025 సీజన్‌కు సంబంధించి జిల్లాలో మొత్తం రైతులు 1,86,400లకు గాను మంగళవారం నాటికి డీబీటీ ద్వారా విజయవంతంగా 1,33,135 మంది రైతులకు రూ. 112.86 కోట్లు నిధులు నేరుగా రైతుల ఖాతాల్లో చేరినట్లు వివరించారు. రైతుల బ్యాంకు ఖాతాల వివరాలు రైతు భరోసా పోర్టల్‌లో నమోదు చేసినట్లు, మిగిలిన రైతుల ఖాతాల్లోను త్వరలోనే నిధులు జమ కాబోతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్ని ఎకరాలున్న అన్ని ఎకరాలకు తగిన పెట్టుబడి సహాయం అందేలా వ్యవసాయశాఖ అధికారులు చర్యలు చేపట్టినట్లు వివరించారు. పెట్టుబడి భారం తగ్గించడమే కాకుండా వ్యవసాయ ఉత్పాదకత పెంపుకు ఈ పథకం ప్రభావంతంగా ఉపయోగపడుతోందని చెప్పారు.

వానా కాలం సాగు ప్రారంభానికి ముందే నిధులు విడుదల కావడంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు.

నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకునేలా కృషి చేస్తా

సారంగాపూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ఉన్న నిరుపేదలందరు ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకునేలా కృషి చేస్తానని బీజేపీ ఎల్పీ నేత ఏలేటీ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేసి ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారులకు పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో నిరుపేదలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలం గడుపుతున్నారే తప్ప రాష్ట్ర ప్రజలకు చేసిందేమీ లేదని ఆరోపించారు. అనంతరం ఇటీవలే జాం నుండి బోరిగాం తాండాకు రూ. 3కోట్ల 20లక్షలతో నిర్మాణం చేసిన బీటీ రోడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఇంద్రకరణ్‌రెడ్డి , మాజీ జడ్పీటీసీ తక్కల రమణారెడ్డి, నాయకులు కాల్వ నరేష్, కరిపే విలాస్, రాంశంకర్‌రెడ్డి, సాయబ్‌రావు, విరయ్య, మహేశ్వర్‌రెడ్డిలతో పాటు నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు ఉన్నారు.

ముదిరాజ్ సంఘ భవన (షెడ్) నిర్మాణానికి భూమి పూజ చేసిన ఏలేటి

నిర్మల్ రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బంగల్‌పేట్ కాలనీలో రూ. 10 లక్షలతో ముదిరాజ్ సంఘ భవన (షెడ్) నిర్మాణానికి బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి భూమి పూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ... ముదిరాజ్‌ల అభ్యున్నతికి పాటుపడతానని అన్నారు. నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. సంఘ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకి సంఘ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, నాయకులు మెడిసెమ్మె రాజు, పట్టణ అధ్యక్షులు సుంకరి సాయి, నాయకులు పాతర్ల గణేష్, ఆనంద్, పాతర్ల హరీష్, యాటకారి సాయన్న, పాతర్ల వెంకటి, పరమేష్, దేవిదాస్, జింక సూరి, జుట్టు దినేష్, గిల్లి విజయ్, గవాస్కర్, చరణ్, మౌర్యతో పాటు మున్సిపల్ అధికారులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



సంఘ భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

నేడు నర్సాపూర్ (జి)లో ఇందిరమ్మ ఇళ్ల పత్రాల పంపిణీ చేయనున్న ఏలేటి

నర్సాపూర్(జి), జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల పత్రాల పంపిణీ కార్యక్రమం జరగనుందని, ఈ కార్యక్రమానికి నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని ఎంపీడీవో పుష్పలత తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని ఎంపీడీవో పుష్పలత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చేతుల మీదుగా ఇందిరమ్మ ఇళ్ల పత్రాలు అందజేయనున్నారు.

నేడు దిలావర్‌పూర్‌లో పర్యటన

దిలావర్‌పూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి గురువారం దిలావర్‌పూర్‌లో పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

బూరుగుపల్లి(కే)లో రోడ్లు, కాలువల ఆక్రమణపై ఫిర్యాదు

నర్సాపూర్(జి), జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బూరుగుపల్లి(కే) గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్లు, మురికి కాలువల ఆక్రమణల సమస్యలపై అదే గ్రామానికి చెందిన జాదవ్ మోతీలాల్ పటేల్ బుధవారం మండల పంచాయతీ అధికారి పుష్పలతకు ఫిర్యాదు చేశారు. తన దరఖాస్తులో జాదవ్ మోతీలాల్ పటేల్ గ్రామస్తులు అక్రమంగా రోడ్లపై కంచెలు వేసి, ఇళ్లను నిర్మించారని, దీనివల్ల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. అంతేకాకుండా మురికి కాలువలను పూర్తిగా తొలగించి ఇళ్లు కట్టడం వల్ల వర్షపు నీరు నిలిచిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రభుత్వ రోడ్లను కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టారని, చేతి పంపులు, సబ్ మెర్సిబుల్ పంపులను మూసి వేయించాలని, దీనివల్ల తాగునీటి సమస్య తలెత్తుతున్నాయని ఆయన హైలెట్ చేశారు. ఈ ఆక్రమణలపై తక్షణమే చర్యలు తీసుకొని, పర్మినెంట్ కట్టడాలు, రోడ్లు, కాలువలను తొలగించి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని జాదవ్ మోతీలాల్ పటేల్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములను, ఉమ్మడి ఆస్తులను పరిరక్షించాలని ఆయన కోరారు. మండలంలో ప్రభుత్వ స్థలాల్లో నాఖా పర్మిషన్ లేకుండా ఇళ్లు నిర్మిస్తున్నా పంచాయతీ కార్యదర్శులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ ఫిర్యాదుపై మండల పంచాయతీ అధికారి తగిన విచారణ జరిపి చర్యలు తీసుకుంటారని గ్రామ ప్రజలు ఆశిస్తున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

సారంగాపూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చించోలి(బి) , కౌట్ల(బి), జాం, స్వర్ణ, గ్రామాలతో పాటు తదితర గ్రామాలలో బుధవారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులకు ఇందిరమ్మ కమిటీ సభ్యులు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ అది మాట్లాడుతూ నీరు పేదలందరికి ఇళ్లు ఉండాలనే ఉద్దేశ్యంతో సీఎం రేవంత్‌రెడ్డి ఈ పథకానికి శ్రీకారం చుట్టారని దీంతో ఖాళీ స్థలం ఉన్న నిరుపేల ప్రజలందరూ ఇండ్లు నిర్మించుకోవడానికి రూ. 5లక్షలు ప్రభుత్వం అందిస్తుందన్నారు. కాంగ్రెస్ నాయకులు బోల్లోజీ నర్సయ్య, కోర్వ నవీన్‌రెడ్డి, నారాయణరెడ్డి, పోతిండ్ల శంకర్, అహ్మద్ ముక్తర్, షైక్ షేఫిక్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, లబ్ధిదారులు అధికారులు ఉన్నారు.

పూలే, అంబేద్కర్, సేవరత్న అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్ రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : పూలే, అంబేద్కర్, సేవరత్న అవార్డుల దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు బహుజన సాహిత్య అకాడమీ రాష్ట్ర కమిటీ మెంబర్ నిగులపు లింగన్న తెలిపారు. ఈ అవార్డులకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలతో పాటు పూలే అంబేద్కర్ సిద్ధాంత భావజాలంతో పనిచేసే వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 9963497446 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



భైంసా, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కేంద్రమైన భైంసాలోని సాథ్‌పూల్ వంతెనల సమీపంలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడొకరు దుర్మరణం పాలయ్యారు. భైంసా నుంచి నాందేడ్ వైపు వెలుతున్న లారీ, బెల్‌తరోడ వైపు నుంచి భైంసాకు వస్తున్న బైక్ ఎదురెదురుగా ఢీకొట్టింది. బైక్‌పై ప్రయాణిస్తున్న తానూర్ మండలంలోని బెల్‌తరోడా గ్రామానికి చెందిన చెంచుల సాయినాథ్ (35) దుర్మరణం పాలయ్యాడు. సాయినాథ్ తమ పిల్లలకు సంబంధించిన స్కూల్ టీసీలను తీసుకొని వస్తుండగా ప్రమాదం జరిగింది. మృతునికి భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. భైంసా టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరి మృతి



ఘటనస్థలంలో చంద్రశేఖర్ మృతదేహం.. ప్రమాదానికి కారణమైన బస్సు

భైంసా రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేగాం గ్రామంలో ఆర్టీసీ బస్సు ఢీకొని చంద్రశేఖర్ అనే వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వాలేగాం గ్రామానికి చెందిన బోడేగాం చంద్ర శేఖర్(50) సెలూన్ షాప్‌లో పని చేస్తూ జీవనం కొనసాగించాడు. తాను వాలేగాం నుంచి నిజామాబాద్ వెళ్లేందుకు నడుచుకుంటూ రోడ్డుపై వెళ్తుండగా వేగంగా భైంసా నుంచి నిజామాబాద్ వెళ్లే ఆర్టీసీ బస్సు చంద్రశేఖర్‌ను ఢీకొట్టింది. చంద్రశేఖర్ ఘటన స్థలంలో మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతుని పంచనామా నిమిత్తం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై శంకర్ తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

భైంసా రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాంజ్రి గ్రామానికి చెందిన బి. కిరణ్ గ్రామ సమీపంలో ఉన్న నీటి గుంతలో పడి మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మాంజ్రి గ్రామానికి చెందిన బి. కిరణ్ (18) గత కొద్ది రోజుల నుంచి మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది మద్యం మత్తులో మూడు రోజుల కిందట గ్రామ సమీపంలో ఉన్న నీటి గుంతలో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై శంకర్ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి



ముధోల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతకుంట గ్రామంలో మహాలింగి దేవిదాసు అనే రైతుకు చెందిన ఆవు మంగళవారం రాత్రి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. గ్రామ శివారులో మేయటానికి వెళ్లిన ఆవు దగ్గరలోనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. ఆవు విలువ సుమారు రూ.70 వేల వరకు ఉంటుందని బాధిత రైతు తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతు కోరారు.